
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 13 ఏప్రిల్ 2025
7







నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

కోటికి పైగా మొక్కలునాటి వనజీవిగా పేరుపొందిన ప్రకృతి ప్రేమికుడు, ప్రద్మశ్రీ అవార్డుగ్రహీత దరిపల్లి రామయ్య(79) శనివారం ఉదయం గుండెపోటుతో నిద్రలోనే మృతిచెందారు. ఎన్నో రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వనాలను పెంచిన రామయ్య తన ఇంటి పేరునే వనజీవిగా మార్చుకుని ధన్యజీవిగా నిలిచారు. ఖమ్మం జిల్లా రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందినదరిపల్లి రామయ్య శనివారం తెల్లవారు జామున నిద్ర లేవకపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆయన మరణ వార్త తెలుసుకొని పలువురు నాయకులు, వనప్రేమికులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రకృతి ఒడికి వనజీవి

మొక్కల ప్రేమికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దరిపల్లి రామయ్య అస్తమయం

- తెల్లవారుజామున నిద్రలోనే గుండెపోటుతో మృతి
- కోటికి పైగా మొక్కలు నాటి వనజీవి రామయ్యగా ఖ్యాతి
- 'వృక్షో రక్షతి రక్షితః' పేరుతో నిత్యం మెడలో హారం
- ప్రధానులు, సీఎంలు, కేంద్ర, రాష్ట్ర మంత్రుల నుంచి ప్రశంసలు
- ఆయన సేవలను గుర్తిస్తూ 2017లో పద్మశ్రీ అవార్డు ప్రదానం
- నివాళులర్పించిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు
- ధరిత్రి ముద్దుబిడ్డ వనజీవి రామయ్య
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ఖమ్మం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం, ముత్తగూడెం గ్రామానికి చెందిన దరిపల్లి లాలయ్య, పుల్లమ్మ దంపతుల కుమారుడైన రామయ్య 1946 జూలై 1వ తేదీన జన్మించారు. రామయ్య ఐదేళ్ల వయస్సు నుంచే మొక్కలు నాటుతూ ఉండేవాడు. వివాహం అనంతరం కుటుంబంతో సహా రెడ్డిపల్లి గ్రామానికి వచ్చి గత 35 ఏళ్లుగా అక్కడే నివాసం ఉంటున్నారు. వనజీవి రామయ్య ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం గ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తిచేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేక పశువుల కాపరిగా పనిచేశారు. రామయ్య 1967లో జానమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి సైదులు, సత్యనారాయణ, కనకయ్య ముగ్గురు కుమారులు, సైదమ్మ కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులు సైదులు, సత్యనారాయణ అనారోగ్యంతో మృతిచెందారు. దరపల్లి రామయ్య కుటుంబానికి గతంలో ఏడు ఎకరాల భూమి ఉండేది. మొక్కలు నాటేందుకు ఖర్చులకోసం మూడెకరాల భూమిని అమ్మారు. అశోకచక్రవర్తి రహదారుల వెంట మొక్కలు నాటించారు అని పుస్తకాల్లో చదువుకున్న రామయ్య దాన్ని స్ఫూర్తిగా తీసుకుని చిన్నతనం నుంచే మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం ప్రారంభించారు. రహదారుల వెంట మొక్కలు నాటుతూ, రోడ్ల వెంట ఉన్న చెట్ల వద్ద కాయలు ఏరి వాటి నుంచి వచ్చిన గింజలను ఖాళీస్థలాలు, కొండలపై జల్లుతూ ఉండేవారు. ఎవరైనా మొక్కలు కావాలని ఆయన దగ్గరకు వెళితే ఉచితంగానే గింజలు, మొక్కలను అందించేవారు. పచ్చదనంపై విస్తృత ప్రచారం చేయడమే కాకుండా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ మొక్కలు నాటడం, 'వృక్షో రక్షతి రక్షితః' అంటూ నినాదాలు రాయడం చేసేవారు. ఇంట్లో గిన్నెలు, పాత్రలు, బీరువాలు, గోడలు ఎక్కడైనా ప్రకృతి నినాదాలే రాసేవారు. ఖాళీ పాత్రలు కనిపిస్తే అందులో మట్టిపోసి గింజలు, లేదా మొక్కను నాటే వారు. ఆయా మొక్కలు పెరిగి పెద్దవి అయ్యేవరకు చంటి పిల్లల్లా సాకేవారు. వనజీవి రామయ్య ఇప్పటివరకు కోటికి పైగా మొక్కలు నాటారు. మూడు కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తన కుమారుడు కూతురు వివాహల శుభలేఖలపై సైతం మొక్కలను నాటాలని, వాటిని సంరక్షించాలని నినాదాలు ముద్రించారు.

నేడు అంత్యక్రియలు

వనజీవి రామయ్య అంత్యక్రియలను ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెడ్డిపల్లి గ్రామంలోని స్థానిక శ్మశానవాటికలో వనజీవికి అంతిమ వీడ్కోలు పలకనున్నట్లు తెలిపారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. కాగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై నివాళులర్పించనున్నారు.



రామయ్య భౌతిక కాయం

మెడలో 'వృక్షో రక్షతి రక్షితః' నినాదంతో హారం

"వృక్షో రక్షతి రక్షితః" అనేది వనజీవి నమ్మిన నినాదం.. ఆ నినాదాన్నే ఒక ఇనుప ప్లేట్‌పై రాసి తన మెడలో హారంగా వేసుకుని తిరిగేవారు. నిడిచి వెళ్లినా, సైకిల్‌పై, మోపెడ్‌పె ఎలా వెళ్లినా, ఎక్కడకు వెళ్లినా "వృక్షో రక్షతి రక్షితః" అనే నినాదం కలిగిన హారాన్ని మెడలో వేసుకొని తిరిగేవారు. ముఖ్యమంత్రులు, ప్రధానులు ఎవరి వద్దకు వెళ్లినా రామయ్య తన మెడలో ఆ నినాదాన్ని ధరించేవారు. ఒక రకంగా చెప్పాలంటే ఆ హారం లేకుండా ఆయన ఇంటినుంచి కాలుబయపెట్టేవారు కాదు. వనజీవి రామయ్య మొక్కల పెంపకమే కాకుండా అద్భుతమైన శిల్పి కూడా. తన ఇంటి వద్ద గ్రానైట్ రాళ్లపై అద్భుతమైన శిల్పాలను (మిగతా 8వ పేజీలో)



విజేత శ్రీనివాసరావుకు స్వీటు తినిపిస్తున్న మిత్రుడు వెంకటేశ్వరరావు

'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రాలో రైతును వరించిన అదృష్టం

- రాష్ట్ర స్థాయిలో కారు గెలుచుకున్న బోనకల్ మండలం రామాపురం వాసి
- విజేతను ఫోన్లో అభినందించిన మంత్రి పొంగులేటి
- కారులేని లోటును 'ఆంధ్రజ్యోతి' తీర్చింది: విజేత శ్రీనివాసరావు

బోనకల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో ఓ రైతును అదృష్టం వరించింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రామాపురం గ్రామానికి చెందిన గూడిపుడి శ్రీనివాసరావు రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచి మారుతి స్విఫ్ట్ కారును సొంతం చేసుకున్నారు. 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన లక్కీ డ్రాలో రెవెన్యూ, సమాచార, ప్రసారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి వచ్చిన కూపన్ల నుంచి మంత్రి ఒకరిని డ్రా తీయగా శ్రీనివాసరావు పేరు వచ్చింది. దీంతో మంత్రి ఆయనకు స్వయంగా ఫోన్ చేసి అభినందించారు. విజేత కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అక్షరమే ఆయుధంగా పని చేస్తున్న 'ఆంధ్రజ్యోతి' అందరి మన్నలను అందుకోవడంతో పాటు పాఠకుల్లో ఉత్సాహాన్ని నింపే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు దశాబ్ధాలుగా పాఠకులకు వార్తా కథనాలతో పాటు మంచి బహుమతులు ఇస్తూ ముందుకు సాగడం ఎండీ వేమూరి రాధాకృష్ణ దార్శనికతకు నిదర్శనమన్నారు.

కారు లేని లోటును 'ఆంధ్రజ్యోతి' తీర్చింది
విజేత గూడిపుడి శ్రీనివాసరావు

మాకు కారు లేని లోటును 'ఆంధ్రజ్యోతి' తీర్చింది. నాకున్న పది ఎకరాల భూమితో పాటు మరో పది ఎకరాల కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటాను. గత మూడెళ్లుగా 'ఆంధ్రజ్యోతి' పత్రికను చదువుతున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా తమ బంధువులు, స్నేహితులు ఫోన్ల ద్వారా అభినందిస్తున్నారు. గ్రామంలో అందరూ తన ఇంటికి వచ్చి స్వీట్లు ఇచ్చి అభినందనలు చెబుతున్నారు. 'ఆంధ్రజ్యోతి' పత్రిక చదవడంతోనే ఇంత గుర్తింపు వచ్చింది. లక్కీడ్రాలో విజేతగా నిలవడం గొప్ప అనుభూతిని ఇచ్చింది. మాకు ఇది నిజమైన పండుగ రోజు. మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది.



పాదయాత్రలో ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బీజేపీది అప్రజాస్వామిక పాలన

- రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోంది
- జైబాపు, జైభీమ్ జైసంవిధాన్ పాదయాత్రలో మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతిప్రతినిధి): కేంద్రంలో బీజేపీ అప్రజాస్వామిక పాలన సాగిస్తోందని, రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. రఘునాధపాలెం మండలం జింకలతండాలో శనివారం జైబాపు, జైభీమ్ జైసంవిధాన్ పాదయాత్రలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జింకలతండాలో జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజల హక్కులకు భంగం కలిగించేలా బీజేపీ పాలన సాగుతోందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కేంద్ర నిర్ణయాలు ఉంటున్నాయని, బీజేపీ విధానాలు, కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక పద్ధతులు దేశానికి తీరని నష్టమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

- నేడు నిత్య కల్యాణాల పునరుద్ధరణ
- భక్తిశ్రద్ధలతో గోదావరిలో చక్రతీర్థం



చక్రతీర్థం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించి వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గోదావరిలో స్వామివారి సుదర్శనచక్రానికి భక్తిశ్రద్ధలతో చక్రతీర్థం నిర్వహించారు. సీతారామచంద్రస్వామిని, సుదర్శనచక్రాన్ని ఆలయం నుంచి పల్లకిలో భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గోదావరి తీరంలోని పునర్వసు మండపంలో పంచామృతాలతో స్నపనం నిర్వహించారు. చక్రతీర్థంతో పాటు భక్తులు సైతం నదిలో స్నానం చేస్తే సర్వపాపాలు హరిస్తాయన్న విశ్వాసం ఉండటంతో వందలాది మంది భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. సాయంత్రం ఆలయంలో ధ్వజ అవరోహణం చేసి ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. రాత్రి శేష వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, స్థానాచార్యులు కేశ స్థలశాయి, ప్రధాన అర్చకుడు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, అమరవాది మురళీకృష్ణమాచార్యులు, ముఖ్యఅర్చకుడు పొడిచేటి రామభద్రాచార్యులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

శ్రీరామ నవమి సందర్భంగా భద్రాద్రి దేవస్థానంలో మార్చి 30న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు శనివారం జరిగిన చక్రతీర్థం, ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు, శ్రీ పుష్పయాగంతో పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిలిపివేసిన నిత్యకల్యాణాలను ఆదివారం పునః ప్రారంభించనున్నారు.



నేడు మధిరలో డిప్యూటీ సీఎం

భట్టి పర్యటన

- రూ.128కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి శంకుస్థాపన

మధిరటౌన్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం మధిర పట్టణంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. మధిర పట్టణంలో ప్రతిష్టాత్మకంగా రూ.128కోట్లతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి మధిర మెయిన్ రోడ్డులో శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం వంగవీడు గ్రామంలో వంగవీడు నుంచి నక్కలగరుబు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు, కృష్ణాపురం నుంచి బుచ్చిరెడ్డిపాలెం వరకు నిర్మించనున్న బీటీ రహదారికి, ఆత్కూరు నుంచి పిల్లిగుట్ట వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఆత్కూరులో భట్టి శంకుస్థాపన చేయనున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు

ఏడు క్వింటాళ్ల గంజాయి సీజ్

- ఇద్దరిని అరెస్టు చేసిన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు
- 10మంది నిందితులపై కేసు నమోదు

కొత్తగూడెం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఏడు క్వింటాళ్ల నిషేధిత గంజాయిని భద్రాద్రి జిల్లా కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఘటనలో పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి మొత్తం 10మందిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ వివరాలను వెల్లడించారు. వాహనాల తనిఖీలో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం కొత్తగూడెం పోలీసులు యూపీ 82ఏటీ 9894 నెంబర్ గల లారీని ఆపి తనిఖీ చేయగా ఆ లారీలో 727.360 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి విలువ సుమారు రూ.3,63,68,000 ఉంటుందని తెలిపారు. ఈ గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లా బోదలా పోలీస్‌స్టేషన్‌పరిధిలోని రియల్‌ఎస్టేట్ వ్యాపారి శివంగుప్తా గంజాయి తరలింపు కోసం లారీ డ్రైవర్ బురుసింగ్, మరో వ్యక్తి రవికుమార్‌లతో ఒప్పందం చేసుకున్నాడు. దాంతో వారు లారీ క్యాబిన్‌కు, ట్రక్‌మధ్య భాగంలో ఓ చాంబర్ తయారుచేసి ఏపీలోని ఏఎస్ఆర్ జిల్లా చింతూరు మండలంలోని తొలిసిపాక అటవీ గ్రామంలో 727.360కేజీల గంజాయిని లోడ్ చేసుకుని ఈ నెల 10వ తేదీన బయలు దేరారు. ఈ క్రమంలో భద్రాచలం, ఖమ్మం, హైదరాబాద్ మీదుగా ఆగ్రాకు తరలిస్తుండగా కొత్తగూడెం పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో శనివారం కొత్తగూడెంలో లారీని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులు బురుసింగ్, రవికుమార్‌తో పాటు గంజాయి కొనుగోలు చేసిన శివగుంప్తా, అమ్మిన వ్యక్తులు కొర్రా సీతారాములు, వంతాల విశ్వనాథ్, వంతాల బాబురావు, కిలో చిన్నరావు, కిలో సాయిబాబు, కిలో శంకర్‌రావు, భద్రి అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పట్టుబడ్డ నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కొత్తగూడెం వన్‌టౌన్‌సీఐ కరుణకర్, ఎస్ఐ విజయ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఎస్. ప్రవీణ్, రామారావు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ప్రత్యేకంగా అభినందించారు.


2017లో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్న రామయ్య


ఢిల్లీలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో వనజీవి


వనజీవి దంపతులను అభినందిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


వనజీవి దంపతులను సన్మానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, చిరంజీవి


రామయ్యను పరామర్శిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


చిన్న జీయర్ స్వామితో రామయ్య దంపతులు

వనానికి శోకగీతం

పుట్టి బుద్దెరిగిన దగ్గర నుంచి అస్తమయం వరకు పచ్చదనం కోసమే పరితపించిన వనజీవి రామయ్య శనివారం తుది శ్వాస విడిచారు. విత్తనాలు, మొక్కలు, చెట్లు, పర్యావరణమే లోకంగా తన జీవితమంతా గడిపారు. పరిహాసాలు, ఛీత్కారాలు ఎదురైనా పాదులు తీయడం ఆపలేదు.. మొక్కలకు జీవం పోయడంలో విసిగిపోలేదు. ఎర్రటి ఎండలో నడి వేసవిలో ఒక్కో విత్తనాన్ని ఓపికగా ఏరి జోలెలో వేసుకుని, మేఘాలు వర్షించి మట్టి వాసన రాగానే..అంకురాల కోసం ఆశగా విత్తే వృక్షజీవి ఇక లేరు.

ప్రకృతి ఒడికి వనజీవి

(7వ పేజీ తరువాయి)

చెక్కేవారు. ఆ శిల్పాలపై కూడా వృక్షోరక్షతి రక్షితః అంటూ నినాదాలు చెక్కేవారు.

మొక్కల పెంపకంపై విస్తృత ప్రచారం

వనజీవి రామయ్య తాను మొక్కలు నాటడమే కాకుండా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని విస్తృత ప్రచారం చేసేవారు. 2000 సంవత్సరంలో వనజీవి సేవలను గర్తించిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆనాటి ఆర్‌అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయనకు టీవీఎస్ బండి బైక్ బహూకరించి దాని పెట్రోలు ఖర్చులకు నెలకు రూ.1,500 మంజూరు చేశారు. చంద్రబాబునాయుడు హయాంలో ఇచ్చిన ద్విచక్రవాహనంపై తిరుగుతూ రామయ్య మొక్కల పెంపకంపై విస్తృత ప్రచారం చేశారు. నాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమంలోనూ వనజీవి పాలు పంచుకున్నారు.

పాఠ్య పుస్తకాల్లో వనజీవి జీవిత పాఠం

పద్మశ్రీ వనజీవి రామయ్య కృషిని గుర్తించిన మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతిలో రామయ్య జీవితాన్ని పాఠ్యాంశంగా బోధిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘికశాస్త్రంలో వనజీవి గురించి పాఠ్యాంశం పొందుపరిచింది.

తన మనవరాళ్లకు మొక్కల పేర్లు..

వనజీవి రామయ్య మొక్కలపై ఉన్న ప్రేమతో తన కుమారుల కూతుర్లకు మవనవరాళ్లకు కూడా మొక్కల పేర్లు పెట్టారు. తనకు ఉన్న నలుగురు మనవరాళ్లకు కబంధపుష్పం, చందనపుష్పం, వనశ్రీ, హరితారణ్య అంటు పేర్లు పెట్టి మొక్కలపై తనకున్న ప్రేమను చాటారు.

నెరవేరని వనజీవి ఆశయం...

పద్మశ్రీ వనజీవి రామయ్యకు ఒకే ఒక్క ఆశయం ఉండేది. కరెన్సీ నోట్లపై మొక్కల ఫోటోలు ముద్రించాలనేవారు. వాటితో పాటు గ్రీన్ కరెన్సీ తీసుకురావాలనే ఆశయం రామయ్యకు ఎప్పటినుంచో ఉండేది. ప్రధాని, సీఎంలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరిని కలిసినా రామయ్య వారికి ఈ విషయాన్ని వివరించేవారు. ఈ ఒక్క ఆశయం రామయ్యకు మిగిలిపోయింది.

ప్రశంసలనుంచి ప్రద్మశ్రీ వరకు...

వనజీవి రామయ్య ప్రధానమంత్రులు, పలువురు ముఖ్యమంత్రులతో ప్రశంసలు పొందారు. నాటి చంద్రబాబునాయుడుతో పాటు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సత్కారాలు పొందారు. 2013 ఏప్రిల్ 8న బెంగుళూరుకి చెందిన అకాడమి ఆఫ్ యూనవర్సల్ గ్లోబల్ పీస్ అనే సంస్థ వారు వనజీవి రామయ్యకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. నాటి ప్రధాని పీవీ నరసింహరావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నాటి గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే చేతుల మీదుగా ప్రశంసలు, సన్మానాలు అందుకున్నారు. ఒక దశలో కుటుంబాన్ని కూడా పక్కకు పెట్టి మొక్కలు నాటడమే వృత్తిగా మార్చుకున్న వనజీవి రామయ్య సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2017మార్చి 30న పద్మశ్రీ అవార్డు అందజేసింది. నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా వనజీవి రామయ్య పద్మశ్రీ అందుకున్నారు.

వనజీవి శ్రమను గుర్తించిన మంత్రి తుమ్మల

వనజీవి రామయ్య శ్రమను 2000 సంవత్సరానికి ముందు నాటి మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు గుర్తించారు. దీంతో ఖమ్మం జిల్లాకు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఎవరొచ్చినా వారివద్దకు వనజీవి రామయ్యను తీసుకువెళ్లి మొక్కల పెంపకంలో ఆయన చేసే సేవలను తుమ్మల వివరించేవారు. వనజీవికి పద్మశ్రీ అవార్డు వచ్చిన తరువాత 2018లో తుమ్మల రామయ్య ఇంటిక వెళ్లి డబల్ బెడ్‌రూం ఇల్లు కట్టించి ఇచ్చారు.

పర్యావరణ పరిరక్షకుడిని కోల్పోయాం: ఎంపీ

పద్మశ్రీ అవార్డుగ్రహీత వనజీవి రామయ్య మృతితో దేశం ఒక గొప్ప పర్యావరణ పరిరక్షకుడిని కోల్పోయిందని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకరరెడ్డితో కలిసి రామయ్య మృతదేహం వద్ద ఎంపీ నివాళులర్పించారు.

స్ఫూర్తి నింపిన మహనీయుడు: పొంగులేటి

వనజీవి రామయ్య అకాల మృతి ప్రకృతిప్రేమికులకు తీరనిలోటని, పర్యావరణ పరిరక్షణలో స్ఫూర్తి నింపిన మహనీయుడని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వనజీవి రామయ్య మృతిపట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో సంతాప తెలిపారు. కోటికిపైగా మొక్కలు నాటి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. అలాంటి మహనీయుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ధరిత్రి ముద్దుబిడ్డ వనజీవి రామయ్య: తుమ్మల

పర్యావరణ ప్రేమికుడిగా మొక్కలే ప్రాణంగా జీవించిన మహోన్నత వ్య క్తి, ధరిత్రి ముద్దుబిడ్డ వనజీవి రామయ్య మృతి దేశానికి తీరనిలోటని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కోటికిపైగా మొ క్కలు నాటిన ప్రాణదాత రామయ్య అని, ఆయనతో తనకు ఉన్న సుదీర్ఘ అ నుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. శనివారం రామయ్య మృతి తెలుసుకన్న మంత్రి తుమ్మల హైదరాబాదునుంచి ఖమ్మం వచ్చి మృతదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. మొక్కలే ప్రాణంగా జీవించిన మహోన్నత శిఖరం, వనసంరక్షణ ధ్యేయంగా ఆయన పనిచేశారని, ఇంటిపేరునే వనజీవిగా మార్చుకున్న ఘనత రామయ్యదన్నారు. చెట్లనే ప్రాణంగా ప్రేమించిన వ్యక్తి అని, ఆయన మరణం ధరిత్రికి తీరనిలోటన్నారు. కోటిపైగా మొక్కలు నాటి పద్మశ్రీ అవార్డు దక్కించుకున్న రామయ్య ఖమ్మం జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిచెప్పారన్నారు. తన మనుమరాళ్లకు సైతం మొక్కల పేర్లుపెట్టి నిజమైన ప్రకృతిప్రేమికుడిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన మృతి తెలంగాణ రాష్ట్రానికి ,ఆయన కుటుంబసభ్యులకు తీరనిలోటన్నారు. ప్రభుత్వ పక్షాన సంతాపం, సానుభూతి తెలిపారు. రామయ్యతో 1994నుంచి విడదీయరాని బంధం ఏర్పడిందని, మొక్కల పెంపకం, సంరక్షణ పైన భావితరాలకు స్ఫూర్తి నింపారని, చివరి నిమిషం వరకు తన కర్తవ్యం నిర్వహించారని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో కూడా మొక్కలు పెంపకంపైనే ఆలోచించారని, తనను కలిసినప్పుడు ఆరోగ్యంగురించి అడిగితే మొక్కల పెంపకం, సంరక్షణ గురించి చెప్పేవాడని తుమ్మల గుర్తుచేసుకున్నారు. తాను జిల్లా పర్యటనలో ఉన్న సమయంలో పలుచోట్ల రోడ్లపక్కన మొక్కలునాటుతూ, చెట్లకింద విత్తనాలు సేకరిస్తూ కనిపించే వాడని, కారు ఆపి ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవాడని తుమ్మల గుర్తు చేసుకున్నారు.

వనజీవి రామయ్య మరణం తీరనిలోటు

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మరణం దేశానికి, రాష్ట్రానికి తీరనిలోటని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. తన క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఇంటిపేరునే వనజీవిగా మార్చుకుని కోటికి పైగా మొక్కలు నాటి రికార్డులు సృష్టించిన వనజీవి రామయ్య మొక్కల నాటడం, సంరక్షించడాన్ని ఒక ఉద్యమంగా మార్చారన్నారు. అనారోగ్యంతో ఉన్నా ఆయన తన మొక్కలు నాటే ఉద్యమం ఆపలేదన్నారు. పర్యావరణ హితం కోసం ఆరున్నర దశాబ్దాలుగా హరితయాత్ర సాగించిన ఆయన జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ


నివాళులర్పిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి


నివాళులర్పిస్తున్న సీపీఐ నేత బాగం


నివాళులర్పిస్తున్న సీపీఎం నేత పోతినేని


నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు


నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాళ

రాజీవ్ యువ 'వికాసం'

7రోజుల్లో 5,155 దరఖాస్తులు..

కిట కిట లాడుతున్న కేఎంసీ కౌంటర్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఖమ్మం నగరంలో అనూహ్య స్పందన కనిపిస్తోంది. ప్రారంబం రోజు మినహా రోజు రోజుకు ఆశావాహుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రారంభం రోజు 238 దరఖాస్తులు రాగా గురువారం ఒక్క రోజే 1204 దరఖాస్తులు అందాయి. పెరుగుతున్న దరఖాస్తుల తాకిడికి తగిన విధంగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య రెండో కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా సీవోలు, ఆర్పీలకు బాధ్యతలు కేటాయించారు. గత ఏడు రోజుల్లో మొత్తం 5,155 దరఖాస్తులు అందాయి. వాటిలో ఎస్సీ 1087, ఎస్టీ 332, బీసీ 2,526, జనరల్ పేదవారు 216, మైనార్టీ 945, క్రిష్టియన్ మైనార్టీ 5, దివ్యాంగులు 44 మంది దరఖాస్తులు చేశారు.

ఆన్‌లైన్‌కు మీ సేవా కేంద్రాలకు పరుగు

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో బయట ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను మాత్రమే తీసుకుంటున్నారు. వారికి తిరిగి రశీదులు అందిస్తున్నారు. ప్రైవేట్ మీ సేవా కేంద్రాల్లో అధికంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. కానీ కేఎంసీ కార్యాలయంలో ఆన్‌లైన్ సౌకర్యం ఏర్పాటు చేసి రాజీవ్ యువ వికసానికి దరఖాస్తులను ఏర్పాటు చేసే అవకాశం కల్పిస్తే ఎన్నో నిరుపేద కుటుంబాలకు మీ సేవ ఖర్చులు మిగులుతాయి. అలాగే రాజీవ్ యువ వికాసం కౌంటర్‌ల్లో దరఖాస్తుదారులకు తాగునీటి ఇక్కట్లు తప్పటం లేదు. కౌంటర్లు వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలని దరఖాస్తుదారులు కొరుతున్నారు.

పర్ణశాలలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


చక్రస్నానమాచరిస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల చివరిరోజైన శనివారం నాడు పర్ణశాల రామాలయంలో చక్రస్నానం, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం, తిరుమంజనం తదితర కార్యక్రమాలను జరిపించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ సుదర్శన పెరుమాళ్లను పవిత్ర గోదావరి నదికి తోడ్కొని వెళ్లి చక్రస్నానం కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనీల్‌కుమార్, ముఖ్య అర్చకులు కారంపూడి కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, రాజగోపాలాచార్యులు, నరసింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంస్కృతానికి ప్రాధాన్యం పట్ల హర్షం


రామకృష్ణమాచార్య

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వ ఆలోచనను హర్షిస్తున్నామని జిల్లా సంస్కృత అధ్యాపక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మన భారతీయ వాంగ్మయమంతా సంస్కృత భాషలోనే ఉందని అన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో హనుమత్ ప్రసాదు, రవికిరణ్, పాషా, మల్లికార్జున శర్మ, ప్రభాకర్, సుజాత, బ్రహ్మాచారి తదితరులు ఉన్నారు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

'ఉపాధి'కి తిప్పలు

- పనుల గుర్తింపు కష్టతరం
- విధానంలో మార్పులతో అధికారులకు తంటాలు
- కొన్ని పనులకు స్వస్తి
- ఆసక్తి చూపని పనులకు చోటు
- వేతనాలు రాక ఫీల్డ్ సిబ్బంది విలవిల

బోనకల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిన చందాన ఉంది ఉపాధి హామి పథకంలో పనులను కల్పించే కొత్త విధానం పరిస్థితి. గత ఏడాది వరకు వ్యవసాయం, ఇరిగేషన్‌కు సంబంధించి అన్ని రకాల పనులను ఉపాధి పథకంలో ఉండటంతో కూలీలకు సమృద్ధిగా పనులు దొరకడంతో పాటు రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేది. కాని ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పనుల కల్పనలో మార్పులు తీసుకు రావడంతో గ్రామాలలో కూలీల ద్వార చేసే పనులను ముందస్తుగా గుర్తింపు ప్రక్రియ అధికారులకు అగ్నిపరీక్షగా మారింది. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో ప్రస్తుతం 30 వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు సమృద్ధిగా ఉండటంతో ఎక్కువ మంది ఉపాధి పనులకు రావడం లేదు. ఈ నెల చివర నాటికి వ్యవసాయ పనులు పూర్తి కానుండటంతో కూలీలంతా ఉపాధి బాట పట్టనున్నారు. కానీ పనులు కల్పించడం అధికారులకు కత్తి మీద సాములా మారనుంది.

మార్పులు...తప్పని తంటాలు

గతంలో రాగస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఉపాధి హామీ పనులకు సంబంధించి మస్టర్లు, పేమెంట్లు, పనుల అప్‌లోడింగ్ ప్రక్రియలను చేపట్టేవారు. రెండేళ్ల నుంచి ఎన్‌ఐసీ(నేషనల్ ఇన్‌ఫార్మటిక్ సెంటర్) వెబ్‌సైట్‌ను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపిస్తుంది. రాష్ట్ర సర్వర్‌ను ముగింపజేసి, కేంద్రం తమ ఆధ్వర్యంలో నడిచే వెబ్‌సైట్ ద్వారా ఉపాధి పనుల నిర్వహణ చేపడుతోంది. దీంతో ఉపాధి పథకం ద్వారా ఎలాంటి పనులు చేపట్టాలన్నా కేంద్రం అనుమతితోనే జరిపించాల్సి ఉంది. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలను ప్రామాణికంగా తీసుకొని పనుల కల్పనను రూపొందిస్తుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం ఉంటే ఇక్కడ పరిస్థితులకు అనుగుణంగా పనుల కేటాయింపులకు సంబంధించి అంచనాలు వేసి పంపుతారు. కానీ ప్రస్తుతం కేంద్రమే నేరుగా పనుల కల్పనకు శ్రీకారం చుట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా అధికారులకు తిప్పలు తప్పడం లేదన్న బావన వ్యక్తమవుతుంది.

గత పనులకు స్వస్తి..

గతంలో వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న పంట కాల్వలు, చెరువుల పూడికతీత పనులతో పాటు పేద రైతుల భూముల్లో చదును చేసే పనులు కూడ చేపట్టేవారు. ప్రస్తుతం అట్టి పనులకు స్వస్తి పలికారు. డొంక రహదారులు, పొలాల మధ్య రోడ్ల పనులతో పాటు ఎంపీటీ, ఫారం పాండ్స్ నీటిని నిల్వ చేసే కుంటల తవ్వకాల పనులను గుర్తించేలా ఆదేశాలు ఉన్నాయి. పొలాల్లో నీటి ట్యాంకుల తవ్వకాలకు సంబందిన పనులను చేయించుకునేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఎక్కువగా పంట కాలువలు, చెరువుల పూడికతీత పనులే ఉపాధి పథకంలో అందరికి ఆమోదయోగ్యంగా ఉండే పనులుగా చెబుతుంటారు. కాని వాటికి చోటు లేక పోవడంతో కొత్త పనుల గుర్తింపు, వాటి నిర్వహణ తలనొప్పిగా మారింది.

వేతనాలు రాక విలవిల..

మూడు నెలలుగా ఫీల్ అసిస్టెంట్లకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు కూడ ఆరు వారాల పనులకు సంబంధించి పనుల వేతనాలు రాక విలవిలలాడుతున్నారు. గతంలో మాన్యూవల్ ద్వారా మస్టర్ల ప్రక్రియను చేపట్టేవారు. కాని ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ మొబైల్ యాప్ ద్వార మస్టర్లను వేస్తుండటంతో పని ప్రదేశం వద్ద కూలీలు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉపాధి పథకాన్ని పర్యవేక్షించే మండల స్థాయి అధికారులకు కూడా గత రెండేళ్లుగా ప్రయాణ భత్యం రావడం లేదు.

జమలాపురం ఆలయంలో భక్తుల రద్దీ


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు శ్రీ వెంకటేశ్వరస్వామి అన్నదానసత్రంలో దాతలు సహకారంతో సేవాసమితి నిర్వాహకులు అన్నగోవిందంలో భాగంగా భక్తులకు ఉచితంగా అన్నవితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ ఇరకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, వెంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి, చొప్పవరపు శ్రీనివసారావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం

» ఆత్మ కమిటీ చైర్మన్ రామకోటేశ్వరరావు



పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోనకల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా ప్రజల్లో చైతన్యాన్ని నింపుతున్నామని ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శనివారం నిర్వహించిన జై బీం, జై బాపు, జై సంవిదాన్ కార్యక్రమంలో బాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విదంగా బీజేపీ అనుసరిస్తున్న విధానాలను తిప్పి కొట్టడమే లక్ష్యంగా గ్రామాల్లో ప్రజలను కలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, చేబ్రోలు వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, జనప్రియ కుమార్, బద్రు నాయక్, చిర్రా ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధిరలో రైల్వేగేటు వద్ద గోడ నిర్మాణానికి అంగీకారం



నాయకులతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు

మధిరటౌన్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో రైల్వేగేటు వద్ద మూడు అడుగుల మేర పాదాచారులు నడిచేందుకు వీలుగా దారి వదిలి పెట్టి గోడ నిర్మాణానికి అంగీకారం తెలుపుతున్నట్లు రైల్వే ఏఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం అఖిలపక్ష నాయకులకు తెలిపారు. రైల్వేగేటు వద్ద రైల్వే అధికారులు గోడ నిర్మించేందుకు పనులు చేస్తుండగా, స్థానిక వ్యాపారులతో పాటు పలు రాజకీయపక్ష నాయకులు పనులను అడ్డుకుని రెండు రోజులుగా టెంట్ వేసుకొని నిరసనకు దిగారు. రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని అప్పటి వరకు దీక్ష విరమించేది లేదని దీక్షకు దిగారు. దీనితో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రైల్వే ఏఈ దీక్షా శిబిరం వద్దకు వచ్చి మూడు అడుగుల వెడల్పుతో వదిలి పెట్టి గోడ నిర్మిస్తామని తెలియ చేయడంతో నాయకులు హర్షం వ్యక్తం చేసి దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి కిషోర్, సీపీఐ నాయకులు బెజవాడ రవిబాబు, సీపీఎం నాయకులు గోపాలరావు, టీడీపీ నాయకులు మల్లాది హనుమంతరావు, బీఆర్ఎస్ నాయకులు అప్పారావు పాల్గొన్నారు.

టేకు దర్వాజా పట్టివేత

దుమ్ముగూడెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీరేంజి పరిధి చిననల్లబల్లి వద్ద అక్రమంగా రవాణా జరుగుతున్న టేకు దర్వాజాను అటవీశాఖ సిబ్బంది శనివారం రాత్రి దాడిచేసి పట్టుకున్నారు. ట్రాక్టరుపై భద్రాచలం వైపు రవాణా జరుగుతుండగా, చిననల్లబల్లి చెక్‌పోస్టు సమీపంలో అటవీ సిబ్బంది కాపుకాసి దాడిచేశారు. ట్రాక్టరుతో సహా టేకు దర్వాజాను దుమ్ముగూడెం అటవీరేంజి కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన కలప వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



జింకలతండాలో సీసీ రహదారులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, రఘునాథపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విదంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం గర్వించ దగిన స్థాయిలో అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఎంపీ రామసహాయం రఘురామరెడ్డితో కలిసి విస్తతంగా పర్యటించారు. ఖమ్మంనగరంలోని 58వ డివిజన్ దోరన్నకాలనీలో రూ.కోటితో నిర్మాణం చేపటనున్న స్మార్ట్ వాటర్ డ్రైన్, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రకాష్‌నగర్‌లో కోల్డ్ స్టోరేజీను ప్రారంభించారు. అనంతరం రఘునాథపాలెం మండలంలో పర్యటించారు. జింకలతండాలో రూ.2.5 కోట్లతో సీసీ రహదారులు, మరో రూ.50 లక్షలతో పోలీస్ ఫైరింగ్ స్టేషన్ వరకు రహదారుల పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడిన 16 నెలల కాలంలోనే ఎంతో అభివృద్ధి, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామని, ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజలకు అపన్నహస్తం అందించామన్నారు. సన్నబియ్యం పంపిణీతో చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దేశంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వమే రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. మొదటి విడతలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతరాయంగా సాగుతుందన్నారు. ఖమ్మం దొరన్నకాలనీలో ప్రజల అవసరాల మేరకు అన్ని రహదారులు నిర్మాణం చేస్తామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో దొరన్నకాలనీ ప్రజలు అత్యధిక మెజార్టీ ఇచ్చారని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత మాట్లాడుతూ తన డివిజన్‌లో ప్రోటోకాల్ పాటించటం లేదని తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో కక్షపూరితంగా వ్యవహరించటం ఉండదని, ప్రోటోకాల్ పాటించారు కాబట్టే స్టేజీ మీద కూర్చొన్నారని తనదైన శైలీలో పేర్కొన్నారు. ఆదర్శవంతమైన వ్యయసాయంలో రఘునాథపాలెం ముందుందని, రాష్ట్రంలోనే అభివృద్ధిలో రఘునాథపాలెం మండలం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఇచ్చిన మాటకు మించిన స్థాయిలో అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. మున్నేరు వరద బాధితులకు ఆర్థిక సహాయంతో పాటుగా భవిష్యత్‌లో వరదలను ఎదుర్కొనేందుకు కావాల్సిన చర్యలను తీసుకున్నారని వివరించారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ కోసం రాష్ట్ర మంత్రి తుమ్మల విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఎంపీ రాఘురామరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు, వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, 58వ డివిజన్ నాయకులు శెట్టి రంగారావు పాల్గొన్నారు.

మూలం సంత మేళాను సందర్శించిన ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామభారతి ఆధ్వర్యంలో నగరంలోని బ్యాంక్ కాలనీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నిర్వహిస్తున్న 'మూలం సంత' సేంద్రియ ఉత్పత్తుల మేళాను శనివారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సందర్శించారు. మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. సేంద్రియ కూరగాయలు, బియ్యం, పండ్లు, పర్యావరణ స్నేహపూర్వక ఉత్పత్తులు, అరకు కాఫీ, శొంఠికాఫీ, దవాచాయ్ మొదలగు ఉత్పత్తుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేళాలో భాగంగా చిన్నారి ఆచరణచే నిర్వహించిన భరత నాట్యం వీక్షకులను అబ్బుర పరిచింది. కార్యక్రమంలో కిసాన్ మోర్చా బాధ్యులు నల్లమల వెంకటేశ్వరరావు, గ్రామభారతి బాధ్యులు కుతుంబాక మాధవి తదితరులు ఉన్నారు.

నేడు వైరాలో టీయూసీఐ జిల్లా మహాసభలు

వైరా, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కామిశెట్టి కల్యాణమండపంలో ఆదివారం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మహాసభలను విజయవంతం చేయాలని శనివారం వైరాలో జరిగిన టీయూసీఐ సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. మహాసభల ప్రారంభానికి ముందు ఆదివారం వైరాలో కార్మికులతో భారీ ప్రదర్శన చేస్తామని తెలిపారు. ఆతర్వాత మహాసభల్లో టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.సూర్యం ప్రారంభోపన్యాసం చేస్తారని నాయకులు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్.పద్మ, సీపీఐ ఎంఎల్-మాస్‌లైన్ ఖమ్మంజిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, వైరా డివిజన్ కార్యదర్శి కె.అర్జున్‌రావు, టీయూసీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.వెంకన్న, జి.రామయ్య, ఆవుల అశోక్ ప్రసంగిస్తారని వివరించారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీవై.పుల్లయ్య, కె.అర్జున్‌రావు, డి.శ్రీనివాస్, షేక్.లాల్‌మియా, తడికమళ్ల సీతరాములు, కన్నెగంటి నవీన్, హన్మంతరావు, రాందాస్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చింతకాని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో శనివారం రాత్రి శివ కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు దాములూరి వెంకటేశ్వరశర్మ, నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో కల్యాణం వైభవోపేతంగా జరిగింది.

భద్రాద్రి జిల్లాలో 14 మంది ఎస్ఐల బదిలీలు

● ఉత్తర్వులను విడుదల చేసిన జిల్లా ఎస్పీ కార్యాలయం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 14 మంది ఎస్ఐలను బదిలీలు చేస్తూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. బదిలీ అయిన వారిలో -

టేకులపల్లి ఎస్‌హెచ్‌వో ఉన్న పి.సురేష్‌ను ఐటీ కోర్‌కు, కరకగూడెం ఎస్‌హెచ్‌వో రాజేందర్‌ను టేకులపల్లి ఎస్‌హెచ్‌వోగా, ఇల్లందు ఎస్ఐ పటాన్ నాగుల్‌మీరాఖాన్‌ను కొమరారం ఎస్‌హెచ్‌వోగా, కొమరారం ఎస్‌హెచ్‌వోగా పని చేస్తున్న ఎం.సోమేశ్వర్ ఆళ్లపల్లి ఎస్‌హెచ్‌వోగా, ఆళ్లపల్లి ఎస్‌హెచ్‌వోగా పని చేస్తున్న ఈ రితీష్ ఓఎస్డీకొత్తగూడేనికి, భద్రాచలం ఎస్ఐ-2 గా పని చేస్తున్న పి.వి.నాగేశ్వరరావును కరకగూడెం ఎస్‌హెచ్‌వోగా, వీఆర్ భద్రాద్రిలో ఉన్న ఎస్‌కె.హసీనా ఇల్లందు ఎస్ఐ-1గా, వీఆర్ భద్రాద్రిలో ఉన్న జి.స్వప్న భద్రాచలం ఎస్ఐ -1గా, భద్రాచలం టౌన్ ఎస్ఐగా ఉన్న జి. విజయలక్ష్మీను వీఆర్ భద్రాద్రికు, వీఆర్ భద్రాద్రిలో ఉన్న బి.రాణాప్రతాప్ కొత్తగూడెం ఓఎస్డీ కార్యాలయం, ఇల్లందు ఎస్ఐగా ఉన్న డి.సందీప్‌ను వీఆర్ భద్రాద్రికు, వీఆర్ భద్రాద్రిలో ఉన్న వి.శ్రీనివాస్‌రెడ్డిను ఇల్లందు ఎస్ఐగా, ఐటీ కోర్ భద్రాద్రిలో ఉన్న కె.శ్రావణ్‌కుమార్‌ను భద్రాచలం ఎస్ఐ-2గా, వీఆర్ భద్రాద్రిలో ఉన్న బి.కిషోర్ కొత్తగూడెం టూ టౌన్ ఎస్ఐలుగా బదిలీలు అయ్యారు.

మెరుగైన విద్యుత్ అందించేందుకు చర్యలు

» విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసాచారి

ఏన్కూరు, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ అందించేందుకు ప్రత్యేక చర్యలుచేపడుతున్నట్టు విద్యుత్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు శనివారం తిమ్మరావుపేట సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా రాజలింగాల, తిమ్మరావుపేట, గ్రామస్తులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ ఇండిపెండెంట్ మెంబర్ ఎం.రామారావు, ఏడీ సతీష్, ఏఈ ఉమాకాంత్, పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఈ

తల్లాడలో...

తల్లాడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తన శక్తి మేరకు జన్మభూమి రుణం తీర్చుకుంటానని ఎన్‌పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచార్యులు అన్నారు. శనివారం తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రా మంలోని సాయిబాబా కల్యాణ మండపంలో ఆపతి వెంకటరామారావు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎస్ఈని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టి పెరిగిన అన్నారుగూడెం గ్రామం అభివృద్ధికి శక్తి మేరకు హితోధికంగా సహాయపడతానని చెప్పారు. కా ర్యక్రమంలో ఏడీఈ సతీష్, ఏఈలు ప్రసాద్, కృష్ణారావు, అన్నారుగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, తుమ్మలపల్లి రమేష్, దుగ్గినేని సత్యనారాయణ, పులి వెంకటేశ్వర్లు, పొన్నం కృష్ణయ్య, దొడ్డా చిన్నశ్రీనివాసరావు, ఆపతి కృష్ణయ్య, గుమ్మా నరేష్ పాల్గొన్నారు.

కారు ఢీకొని భక్తురాలికి గాయాలు

భద్రాచలం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం తూర్పుమెట్ల సమీపంలో నిద్రిస్తున్న రామభక్తురాలిని కారు ఢీకొనటంతో చెవికి గాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా రామమడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు భద్రాద్రి రామయ్య దర్శనార్థం శుక్రవారం అర్ధరాత్రి భద్రాచలం చేరుకున్నారు. ఈ సమయంలో రామాలయం తూర్పుమెట్ల వద్ద నిద్రిస్తుండగా హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రశాంత్ అనే వ్యక్తి కారు నడుపుతూ ఢీకొట్టాడు. దీంతో అమరగొండ లక్ష్మి చేతి మణికట్టుపై ఉన్న కండ చిట్లడంతో పాటు చెవికి దెబ్బ తగిలింది. ఆమెను భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. అనంతరం రామ భక్తుల బృందం తమ స్వగ్రామంకు వెళ్లిపోయారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

కల్లూరు,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ముగ్గువెంకటాపురంలో ప్రధాన రహదారి ప్రక్కన ఐదు రోజుల క్రితం కనిపించిన గుర్తుతెలియని మృతదేహం ఆచూకీ లభ్యమైంది. స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. ముగ్గువెంటాపురం గ్రామా శివారున గల రహదారిపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించిన విషయం తెలిసిందే. సదరు వ్యక్తి తంబుర మురళి (25) ఏపిలోని తిరుపతి జిల్లా మాసాపేటగ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. కొంతకాలంగా మతిస్థిమితం లేక గతనెల 30న ఇంటి నుంచి తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో పలు మార్లు ఇలా ఇంటి నుంచి వెళ్లి పోగా బందువులు వెతికి పట్టుకునే వారని తెలిసింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు శనివారం అప్పగించామని ఎస్ఐ హరిత తెలిపారు.

ఆర్‌పీఎఫ్ సీఐగా సురేష్‌గౌడ్



ఖమ్మంక్రైం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంరైల్వేప్రొటెక్షన్ ఫోర్సు (ఆర్‌పీఎఫ్) సీఐగా బుర్రా సురేష్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. రామగుండం ఆర్‌పీఎఫ్‌లో సీఐగా కొతకాలంగా విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీలో భాగంగా ఆయన్ను ఖమ్మం బదిలీచేశారు. రైల్వే ఆస్తుల పరిరక్షణతో పాటు ప్రయాణికుల భద్రత, రైల్వే ఏరియాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు, నిషేధిత వస్తువుల అక్రమ రవాణపై దృష్టిపెడతామన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

» భార్య మృతి చెందిందని మనోవేదనతో ఒకరు, అనారోగ్య సమస్యతో మరొకరు

దుమ్ముగూడెం,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): భార్య మృతితో మనస్థాపం చెందిన మత్స్యకారుడు దున్న రాజు(50) మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సున్నంబట్టి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి గోదావరి నదిలో వేటకు వెళ్లిన రాజు శనివారం తెల్లవారుజామున గ్రామశివారు గోదావరి ఒడ్డున చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. తోటి మత్స్యకారులు మృతుడి కొడుకు అనీల్‌కు సమాచారమిచ్చారు. గతంలోనూ రాజు ఒకసారి ఉరివేసుకునేందుకు ప్రయత్నించగా, చుట్టుప్రక్కల వాళ్లు చూసి ఆపారు. భార్య చనిపోయిందనే బాధతో తన తండ్రి రాజు మద్యానికి అలవాటు పడ్డాడని, చనిపోవాలని ఉందని కుటుంబ సభ్యులతో అనే వాడని కొడుకు అనీల్ ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ అశోక్ కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో..

ఆళ్లపల్లి: అనారోగ్య సమస్యతో బాధపడుతు మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నల్లమాస ఉప్పలయ్య(51)గీతాకార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. కాగా ఉప్పలయ్య ఇంట్లో ఎవరు లేని క్రమంలో గురువారం పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మెరకు ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ కేసు నమోదు చేశారు.

పాల్వంచలో గంజాయి పట్టివేత



నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

పాల్వంచ, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన సాగర్ హరిదాస్, నీలేష్, కిషోర్ ముఠాగా ఏర్పడి ఒరిస్సాలోని మల్కాజ్‌గిరిలో తక్కువ రేటుకు గంజాయిని కొనుగోలు చేసి ఎక్కువ డబ్బుకు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే మల్కాజ్‌గిరిలో వారు గంజాయిని కొనుగోలు చేశారు. పోలీసుల కళ్ళు కప్పి గంజాయిని కారులో ఒరిస్సా సరిహద్దు మీదుగా భద్రాచలం చేర్చారు. అక్కడ నుంచి పాల్వంచ మీదుగా పూణేకు తరలించడానికి సిద్ధమవుతున్నారు. శనివారం ఈ విషయం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. ఈక్రమంలోనే పాల్వంచ మండలం జగన్నాథపురంగ్రామ శివారులో ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వస్తున్న కారును తనిఖీ చేయగా అందులో 51 కేజీల ఎండు గంజాయి బయటపడింది. దీంతో కారులోని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.28లక్షల 80 వేల విలువైన ఎండు గంజాయిని, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను కోర్టులో హాజరుపరచేందుకు పాల్వంచ ఎక్సైజ్ కార్యాలయానికి అప్పగించామని ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్ తెలిపారు.

ఆడ శిశువుల అనధికార దత్తత?

చింతకాని,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):సంచార జాతులకు చెందిన ఓమహిళలకు తొలి, రెండో కాన్పులో ఆడ శిశువులు జన్మించారు. మూడో కాన్పులో ఆడశిశువులు కవలలు జన్మించడంతో పుట్టిన మూడోరోజునే అనధికారివంగా దత్తత ఇచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ గతనెల 31న ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆడ శిశువులకు జన్మనిచ్చింది. ఇప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉన్న ఆ జంట పసికందులను తెలిసిన వారి సహాయంతో అనధికారికంగా దత్తత ఇచ్చినట్లు తెలిసింది. శనివారం ఐసీడీఎస్ అధికారులు పసికందులను దత్తత తీసుకున్న దంపతుల వివరాలు సేకరించారు. దత్తత ప్రక్రియను అధికారికంగా నిర్వహించాలని ఐసీడీఎస్ అధికారులు తెలిపినట్లు సమాచారం. దీనిపై నిఘా వర్గాలు గ్రామంలో ఆరా తీశారు.

19తులాల బంగారం చోరీ

ఇల్లెందుటౌన్ ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): 19తలాల బంగారం చోరీ జరిగిన సంఘటన ఇల్లెందులోని ఎల్బీఎస్ నగర్ సివిల్ లైన్లో చోటుచేసుకుంది. ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ కథనం ప్రకారం.. సివిల్ లైనింగ్ చెందిన పెద్దపల్లి కుమారుస్వామి అనే సింగరేణి కార్మికుడు రెండురోజుల క్రితం వివాహ నిమిత్తం కుటుంబ సభ్యులంతా పెళ్లికి వెళ్లారు. శనివారం సాయంత్రం తిరిగి ఇంటికివచ్చి చూడగా తలుపు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లో ఉన్న బీరువాను పగలగొట్టి 19 తులాల బంగారాన్ని చోరీ చేశారు. ఇతర వస్తువులు ఏవికూడా చోరీ జరగలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం స్వాధీనం

» 360 కేజీల బెల్లం, 15 కేజీల పటిక, వాహనం స్వాధీనం

» ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి తరలింపు

» ఇద్దరిపై కేసు నమోదు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటిక, వాహనాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ శ్రీహరిరావు ఈ వివరాలు శనివారం తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని రేగళ్ల క్రాస్‌రోడ్ వద్ద రూట్ వాచ్ చేస్తున్న క్రమంలో ఓ వాహనంలో వీటిని తరలిస్తున్నట్లు గమనించారు. కొత్తగూడెం వైపు వెళ్లిన ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకునేందుకు పెద్దబజార్‌కు అధికారులు వెళ్లార. అక్కడే ఓ షాపులో ఆ బెల్లాన్ని దింపేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. 360 కేజీల రంగు మారిన బెల్లం, 15 కేజీల స్పటిక ఉన్నట్లు నిర్ధారించారు. వీటిని కొత్తగూడెం ఎక్సైజ్ కార్యాలయానికి తరలించామని వివరాలు వెల్లడించారు. ఈ సంఘటనలో షాపు యజమాని హెచ్.రామ్‌కుమార్, వాహనడ్రైవర్ ఎల్.మంగీలాల్ ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

వక్ఫ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి):ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలతో వక్ఫ్ సవరణ చట్టాలను ఏర్పాటు చేసిందన్నారు. మైనారిటీ ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ఇప్పటికే ట్రిపుల్ తలాక్, సీఏఏ వంటి చట్టాలను అమలు చేసిందని ఇప్పుడు వక్ఫ్ అంశాల్లో జోక్యం చేసుకొని మతోన్మాధ విధానాలను బయటపెట్టిందని ఆరోపించారు. ముస్లిం మైనార్టీ ఆస్తులను కాజేసేందుకు నూతన చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చిందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శింగు నర్సింహారావు, సలామ్, తాటి వెంకటేశ్వర్లు, తొట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మీనారాయణ, నూనే శశిధర్, రెహమాన్, తాటి నిర్మల, జాలా నర్సింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాగం హేమంతరావు, నాయకులు



కల్లులో పురుగుమందు కలిపిన వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుమలాయపాలెం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లులో పురుగుమందు కలిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకరవాయి గ్రామానికి చెందిన గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాకరవాయికి చెందిన కొత్తపల్లి కృష్ణ అనే రైతు పొలంలో ఉన్న తాటిచెట్టు అతనే గీయించుకుంటున్నాడు గీత కార్మికుడైన చురిగి రాజయ్యపై కక్షపూరితంగా తన చేలో ఉన్న మరో వ్యక్తితో కల్లు గీయించి కల్లులో గడ్డిమందు కలిపి రాజయ్యపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అందాల పోటీలు రద్దు చేయాలి

మిస్‌వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం



నిరసన తెలుపుతున్న మహిళా సంఘాలు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): స్త్రీల ఆత్మ గౌరవాన్ని భంగపరిచే మిస్‌వరల్డ్ అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక కమిటీ నాయకులు శిరోమణి, మాచర్ల భారతి, తాటి నిర్మల డిమాండ్ చేశారు. మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని పీవోడబ్ల్యూ, ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో మిస్ వరల్డ్ వ్యతిరేక వేదికను ఏర్పాటు చేశారు. శనివారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి పోస్టు కార్డు ఉద్యమం ప్రారంభించారు. ఖమ్మంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వానికి పోస్టు కార్డులు రాశారు. ఈనెల 7వ తేది నుంచి 31వరకు హైదరాబాద్‌లో జరగనున్న అందాల పోటీలను రద్దు చేయాలని, ఆ పోటీలకు పెట్టే వ్యయంతో రాష్ట్రంలోని బాలికల వసతిగృహాలకు మౌళిక సౌకర్యాలను కల్పించాలని పోస్టు కార్డులపై రాశారు. నాయకులు ఆవుల మంగతాయి, బండి పద్మ, మెరుగు రమణ, బేగం, అజిత తదితరులు పాల్గొన్నారు.

అఫ్జల్ ఆశయాలను కొనసాగిస్తాం

ఖమ్మంసంక్షేమ విభాగం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో సీపీఎం విస్తరణకు ఎంతో కృషి చేసిన ఎస్కే అఫ్జల్(70) ఆశయాలను ముందుకు తీసుకెళతామని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. అనారోగ్యంతో శనివారం కన్నుమూసిన అఫ్జల్ భౌతికకాయం వద్ద నాయకులు నివాళులు అర్పించారు. సీనియర్ నాయకులు ఎం సుబ్బారావు ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, ఎంఏ జబ్బార్, బండారు రమేష్, ఎస్కే మీరా సాహెబ్, ఎస్కే నాగుల్‌మీరా, ఖమర్, షావకత్ అలీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈనెలాఖరు వరకు రాజీవ్ యువ వికాసం గడువు పెంచాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల గడువును పెంచాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. శనివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. వరసగా మూడు రోజులు ప్రభుత్వ సెలవలు రావటం, వారం రోజులుగా సర్వర్ ఆన్‌లైన్ ఇబ్బందులు కలిగాయన్నారు. ఈనెల 14తో ముగుస్తున్న గడువును ఈనెల చివరి వరకు పొడిగించాలని కోరారు. నాయకులు ఝాన్సీ, ప్రతాపనేని శోభ, కే.శ్రీను, జక్కుల భరత్, బొల్లి కోమరయ్య, చిలకల నర్సింహారావు, ఎస్కే సత్తార్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్రను జయప్రదం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఏప్రిల్21న సికింద్రాబాదులో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు కోరారు. శనివారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల చైతన్యయాత్ర నేడు ఖమ్మం వస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలో భాగంగా 250 గజాలస్థలం, రూ.25వేల పింఛన్ సౌకర్యం, ఇల్లు కట్టుకోవడానికి రూ.10లక్షల వెంటనే అమలు చేయాలని కోరారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారులు ఈ యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

నేలకొండపల్లి తహసీల్దార్ బదిలీ

నేలకొండపల్లి,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):నేలకొండపల్లి తహసీల్దార్ జాదవ్ మాణిక్యాన్ని శుక్రవారం రాత్రి ఆకస్మికంగా బదిలీ చేశారు. సుమారు 7నెలల క్రితమే నేలకొండపల్లిలో బాధ్యతలు తీసుకున్నారు. తహసీల్దార్‌పై ఎటువంటి ఆరోపణలు లేనప్పటికీ ఆకస్మికంగా ఖమ్మం కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేయమంటూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌లో ధరణి కో-ఆర్డినేటర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లును నేలకొండపల్లి తహసీల్దార్‌గా నియమించారు.

పేదలను విస్మరించిన గత ప్రభుత్వం

తిరుమలాయపాలెం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను విస్మరించిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి సంక్షేమానికి కృషిచేస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తిమ్మక్కపేటలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ, తహసీల్దార్‌సుధీర్, ఎస్ఐ జగదీష్, కాంగ్రెస్ నాయకులుపత్తి నాగేశ్వరరావు, ఉన్నం రాజశేఖర్, పోట్ల కిరణ్, సుమన్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొమ్మా వార్షికోత్సవం

ఖమ్మంస్పోర్ట్స్‌ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని బొమ్మా విద్యాసంస్థల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగాయి. వేడుకలను జైళ్లశాఖ డీఐజీ మందారపు సంపత్, విద్యాసంస్థల ఛైర్మన్ బొమ్మా రాజేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, ఇతరులకు సహాయం చేయడం వంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో సమయం కేటాయించి వారికి తోడ్పాటు నందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థ వైస్ ఛైర్మన్ బొమ్మా సత్యప్రసాద్, సెక్రెటరీ ఉదారు శ్రీధర్, లక్ష్మి, మాధవి, అనూష ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంపత్

వనజీవి రామయ్యకు పలువురి నివాళి



వనజీవి రామయ్య భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న జూలూరు గౌరీశంకర్

ఖమ్మంరూరల్,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య(79) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మాజీఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఎఫ్‌వో విక్రమ్ సింగ్ మాన్, ఆర్డీవో నరసింహరావు, జిల్లా వైద్యశాఖాధికారి కళావతిబాయ్, తహసీల్దార్ రాంప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌వి ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కార్పోరేటర్ కమర్తపు మురళి, కాంగ్రెస్ నాయకుడు తుంబూరి దయాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, జిల్లా నాయకులు సాధు రమేష్‌రెడ్డి, కన్నేటి నరసింహరావు, మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, బోడా వెంకన్న తదితరులు నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి, నండ్రా ప్రసాద్ తదితరులు సీపీఐ రాష్ట్ర నాయకులు బాగంహేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, జిల్లా నాయకులు లింగా వెంకటనారాయణ, తదితరులు, బీజేపీ నాయకులు జిల్లా అధ్యక్షులు తాళ్లూరి సత్యనారాయణ, నున్నా రవి, నకిరేకంటి వీరభద్రం తదితరులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూరపాటి వెంకటేశ్వర్లు, మండలాధ్యక్షులు సానబోయిన శ్రీనివాస్ గౌడ్ తదితరులు నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు మండలాధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీజెడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, జిల్లా నాయకులు ఇంటూరి శేఖర్ నివాళులర్పించారు.

ఖమ్మం-మానుకోట రోడ్డుకు రామయ్య పేరుపెట్టాలలి

ఖమ్మంచర్చికాంపౌండ్: తన జీవితాన్ని చెట్ల నాటడానికి పర్యావరణ అభివృద్ధికి అంకితం చేసిన వనజీవి రామయ్య పేరును ఖమ్మం-మానుకోట రోడ్డుకు రామయ్య మార్గ్‌గా పేరు పెట్టాలని ప్రముఖ కవి జూలూరు గౌరీ శంకర్ పేర్కొన్నారు. శనివారం వనజీవి రామయ్య మరణ వార్త తెలుసుకున్న ఆయన రెడ్డిపల్లిలో ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. భార్య జానకమ్మను ఓదార్చి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏటా జరిగే వనమహోత్సవానికి రామయ్య వనమహోత్సవం అని పేరు పెడితే స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు.ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం వనజీవి జీవితాన్ని పాఠ్యాంశంగా పెట్టారని తెలంగాణ ప్రభుత్వంకూడా పర్యావరణజీవిత గాధను సిలబస్‌లో చేర్చాలని కోరారు. నివాళులర్పించిన వారిలో ప్రముఖ కవి ప్రొఫెసర్ సీతారాం, ప్రసేన్ తదితరులుపాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు, మాజీ ఎంపీ నామా, ఎమ్మెల్సీ తాతా మధు సంతాపం

పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్‌రావులు శనివారం సంతాపాన్ని ప్రకటించారు. రామయ్య మృతి ధరిత్రికి తీరని లోటని అన్నారు.

ఆయనతోపాటే చెట్లూ పోయాయ్

- రహదారి విస్తరణలో వనజీవి నాటిన వృక్షాల తొలగింపు
- ఖమ్మ-కురవి మార్గంలో కానరాని నీడ





గతంలో వనజీవి రామయ్య నాటిన మొక్కలు, చెట్లు తొలగించి రోడ్డును విస్తరించిన దృశ్యం

ఖమ్మంరూరల్,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): వనజీవి రామయ్య 35ఏళ్ల క్రితం ఖమ్మం-కురవి రహదారిలో పెంచిన మహావృక్షాలు నేడు కనుమరుగయ్యాయి. రూరల్ మండలం, నాయుడుపేట నుంచి రెడ్డిపల్లిలోని తన ఇంటివరకు గింజలు నాటి, వృక్షాలుగా మారే వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఖమ్మం నుంచి కొరవి, మహబూబాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఈ మార్గంలో నిండు వేసవి కాలంలో ఈ చెట్ల కింద కొతసేపు సేదతీరేవారు. ఈచెట్లు మంచి నీడనిచ్చేవి. అలాంటిది.. రోడ్డు విస్తరణలో వనజీవి రామయ్య నాటిన వృక్షాలను కూకటి వేళ్లతో తొలగించారు.ఈ సమయంలో వనజీవ రామయ్య కన్నీరు పెట్టుకున్నారు. వాటిని నరికివేయవద్దని అడ్డుకున్నారు. వాటిని తొలగించిన స్థానంలో ఒక్కోచెట్టుకు బదులుగా మూడుచెట్లను నాటాలని అధికారులకు సూచించారు. ఆ రహదారిపై రామయ్య ప్రయాణించినప్పుడల్లా గుండె బరువెక్కేదని కుటుంబ సభ్యులతో చెప్పి ఆవేదన వ్యక్తం చేసేవారు.

శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించిన తుమ్మల



ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన సీపీఎం నాయకుడు యర్రా శ్రీకాంత్ కుటుంబ సభ్యులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. శనివారం యర్రా శ్రీకాంత్ నివాసానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి వెళ్లారు. శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్పొరేటర్లు గజ్జల లక్ష్మీ, దొడ్డా నగేశ్, కమర్తపు మురళీ పాల్గొన్నారు.

స్టేడియంలో చలివేంద్రం ప్రారంభం



ఖమ్మంస్పోర్ట్స్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్ధార్ పటేల్ స్టేడియంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మద్దినేని ప్రసాదరావు, కమల దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ప్రారంభించారు. వేసవిలో స్టేడియానికి వచ్చే వ్యాయామదారుల దాహర్తిని తీర్చేందుకు ఔత్సాహికులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ అక్బర్అలీ, లెఫ్ట్ కెనాల్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శాగంటి వెంకటేశ్వరరావు, పలువురు సీనియర్‌క్రీడాకారులు ఉన్నారు.

స్కేటింగ్‌లో స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థిని ప్రతిభ



ఖమ్మంస్పోర్ట్స్,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోలర్ స్కేటింగ్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని పసుపులేటి వీక్ష ప్రతిభ చూపి రజత, కాంస్య పతకాలుసాధించిందని పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్య తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వీక్షకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు వారిలోని సృజనాత్మకతను వెలికి తీస్తామని అన్నారు. భవిష్యత్ పోటీలలో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తిరుమలాయపాలెం,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపెడలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో సీతారాంరెడ్డి ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎల్‌శ్రీను పాల్గొన్నారు.

రాజ్యాంగం, సామాజిక న్యాయంపై సమావేశం

ఖమ్మంఖానాపురంహవేలి,ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): సంపద అందరికి సమానంగా ఉండాలని స్ఫూర్తి రాజ్యాంగం కలిపించిందని, ప్రముఖ వైద్యుడు, సామాజిక విశ్లేషకులు డాక్టర్ ఎఫ్ గోపీనాథ్ అన్నారు నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో శనివారం ప్రాంతీయ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో భారతరాజ్యాంగం సామాజిక న్యాయం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ బి.వీరన్న, పూర్వతెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, నయబాజర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కేఎస్ రామారావు,కేంద్రసాహిత్య అకాడమీ గౌరవ సభ్యులు ప్రసేన్, సీతారం పాల్గొన్నారు.

ఘనంగా 'సెడార్ వ్యాలీ' ప్రథమ వార్షికోత్సవం

విద్యారంగంలో విశేష కృషిని అభినందించిన మంత్రి తుమ్మల



జ్యోతిప్రజ్వలన చేస్తున్న యాజమాన్యం, తుమ్మల



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఖమ్మంస్పోర్ట్స్‌ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): నగరంలోని 'సెడార్ వ్యాలీ' ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసాయం రఘురామిరెడ్డి, ఇస్రోసీనియర్ సైంటిస్ట్ సుందరమూర్తి, డీఈవో సోమశేఖర శర్మ, పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, డైరెక్టర్లు పార్వతి రెడ్డి, చల్లపల్లి ఉదయశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో కొంత సమయం కేటాయించాలని పేర్కొన్నారు. నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాప్రమాణాలను అందించడం అభినందనీయమన్నారు. ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ నానాటికీ విస్తరిస్తున్న ఖమ్మం నగరానికి మణిహారంగా సెడార్‌వ్యాలీ నిలవడం హర్షణీయమన్నారు. ఆధునిక వసతులతో సువిశాల క్రీడా మైదానం, లాబొరేటరీలు లాంటి ఉన్నత ప్రమాణాలతో విద్యార్థులకు విద్య అందించడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం ఇస్రో సీనియర్ సైంటిస్ట్ సుందరమూర్తి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను శాస్త్ర సాంకేతికతో విద్య అందించడంతో విద్యా ప్రమాణాలు పెంపొందించొచ్చని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్ మాట్లాడుతూ బాల్యం ఎంతో విలువైందని రేపటి తరానికి కావాల్సిన అమూల్యమైన విజ్ఞానాన్ని, వత్తిడి లేని విద్యను అందించడమే తమ విద్యాసంస్థల అభిమతమన్నారు.

సూర్యాపేటలో సోనోవిజన్ షోరూం

- 72వ దుకాణాన్ని ప్రారంభించిన సంస్థ ఫౌండర్, చైర్మన్ జనార్ధనమూర్తి



షోరూంను ప్రారంభిస్తున్న చైర్మన్ జనార్ధనమూర్తి, మేనేజింగ్ పార్టనర్ భాస్కరమూర్తి, తదితరులు

విజయవాడ,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): సోనోవిజన్ మరో కొత్త షోరూంను ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట వద్ద వరంగల్ రోడ్, కుడకుడ రోడ్‌లో సోనోవిజన్ 72వ షోరూంను సంస్థ ఫౌండర్, చైర్మన్ పొట్లూరి జనార్థనమూర్తి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికంటే ఎక్కువ నమ్మకం, తక్కువ ధరలు, మంచి క్యాష్‌బ్యాక్ ఆఫర్లతో సోనోవిజన్ ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తోందని, ఈ క్రమంలో ఇక్కడ కూడా అదే నమ్మకం, తక్కువ ధరల్లో ప్రోడక్ట్ అందజేస్తామన్నారు. సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పి. భాస్కరమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం షోరూంలో అనేక మంచి ప్రోడక్ట్లు అందుబాటులో ఉన్నాయని సోనోవిజన్ టీమ్ తరపున నమ్మకమైన ఆఫర్ సేల్ సర్వీసు అందజేస్తామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా అందరికన్నా తక్కువ ధరల్లో అన్ని పెద్ద కంపెనీల ఏసీలు, ఎయిర్ కూలర్స్, రిఫ్రిజిరేటర్స్ ఎల్ఈడీ టీవీలు, మొబైల్స్ ల్యాప్‌టాప్స్, వాషింగ్‌మెషిన్స్ ఇంకా కిచెన్ అప్లయన్సెస్ లభిస్తున్నాయన్నారు. 0% ఫైనాన్స్ ఇంకా ఆకర్షణీయమైన క్యాష్‌బ్యాక్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జీ, లాయిడ్, ఓల్టాస్, ఎంఐ ఇంకా అనేక పెద్ద హోమ్ అప్లయన్సెస్ కంపెనీలకు చెందిన మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

దేశాన్ని ప్రగతిపథంలో తీసుకెళుతున్న మోదీ

- కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



కొత్తకొత్తూరులో ర్యాలీలో పాల్గొన్న శ్రీధర్‌రెడ్డి

నేలకొండపల్లి,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ వైపు అడుగులు వేస్తూ, దేశాన్ని ప్రగతిపథంలో తీసుకెళుతున్న గొప్ప నేత ప్రధాని నరేంద్ర మోదీ అని కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బీజేపీ జాతీయ పార్టీ పిలుపుమేరకు గావ్ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కొత్తకొత్తూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అంత్యోదయ నినాదంతో సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధికి వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలను మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉంటూ కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రైతులకు ఆర్థిక సహకారం అందిస్తున్న ప్రభుత్వం మోదీదేనన్నారు. మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. అనంతరం విశ్వకర్మ యోజన ద్వారా కొత్తకొత్తూరులో లబ్ధి పొందిన వారిని శ్రీధర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు మన్నె కృష్ణారావు, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్.షర్ఫుద్దీన్, నాయకులు తోగటి నాగాచారి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 9గంటలకు రెడ్డిపల్లెలోని వనజీవి రామయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పిస్తారు. ఉదయం10గంటలకు మద్దినేని స్వర్ణకుమారి సోదరి ఇంటికి వెళ్లి పరామర్శిస్తారు. ఉదయం 11గంటలకు సప్తపది ఫంక్షన్‌హాల్లో వివాహ రిసెప్షన్‌కు హాజరవుతారు. మధ్యాహ్నం 12గంటలకు ఏదులాపురం మునిసిపాలిటీ ఆదిత్య నగర్‌లో ఓ వివాహ వేడుకలకు హాజరవుతారు. మధ్యాహ్నం వనజీవి రామయ్య అంత్యక్రియల్లో పాల్గొంటారు. ఆ తర్వాత కూసుమంచి మండలం లోక్యాతండాలో వివాహానికి హాజరవుతారు.

అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నేలకొండపల్లి,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాలను, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల కాంగ్రెస్ నాయకుడు వేగినాటి లక్ష్మీనర్సయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి ముజ్జుగూడెం గ్రామంలో జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంటులో హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసినప్పటికీ, అమిత్‌షా లెక్క చేయలేదన్నారు.అంబేద్కర్‌పై బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను దేశవ్యాప్తంగా ప్రచారం చేసేందులకే జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమాన్నిఏఐసీసీ ప్రారంభించిందన్నారు. తొలుత గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, ఎస్.రమేష్, వి.సీతారాములు, బొడ్డు బొందయ్య, కొమ్మూరి నరేష్, ఉండెమోదుగుల శ్రీను, సిరికొండ బ్రహ్మయ్య, కూచిపూడి ఆదినారాయణ, కూచిపూడి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ అప్పగింత

వైరా, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణంలో అపహరణకు గురైన సెల్‌ఫోన్‌ను దివ్యాంగురాలైన బాధితురాలికి వైరా పోలీసులు అప్పగించారు. మండలంలోని విప్పలమడక గ్రామానికి చెందిన రుద్రాక్ష లక్ష్మీ అనే దివ్యాంగురాలు కొద్దిరోజుల కిందట మధిర నుంచి వైరా వస్తుండగా బస్సులో ఫోన్ పోయింది. ఆమె వైరా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ఫోన్‌ను రికవరీ చేసి బాధితురాలికి అప్పగించారు.

అన్నదానం

తల్లాడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో అంకమ్మ దేవాలయం వద్ద జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఎన్‌పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీనివాసరావు, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆపతి వెంకటరామారావు, తుమ్మలపల్లి రమేష్, జాతర కమిటీ సభ్యులు మారెళ్ల దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, పేరసాని నర్సింహారావు, గోనా యాలాద్రి, దుగ్గినేని సత్యనారాయణ, దిరిశాల వెంకటయ్య పాల్గొన్నారు.

'రహదారులకు మరమ్మతులు చేయాలి'

వైరా, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి జగ్గయ్యపేట-మధిర వెళ్లే క్రాస్‌రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేశారు. ఈ గుంతల వలన నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అయినప్పటికీ ఆర్ అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీపీఐ నియోజకవర్గ, మండల, పట్టణ కార్యదర్శులు ఎర్రా బాబు, యామాల గోపాలరావు, మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థి వంశీకి నివాళి

పెనుబల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వీఎం బంజర్ పాఠశాల విద్యార్థి సడియం వంశీకి పలువురు సంతాపం తెలిపారు. శనివారం స్థానిక పాఠశాలలో వంశీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకుడు వంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంతమందో దాతలు విరాళాలు ఇచ్చినా విద్యార్థి క్షేమంగా వస్తాడని భావించినప్పటికీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు వీవీ.రామారావు, సోమ్లానాయక్, వంగా రామారావు, వాసం వెంకటేశ్వరరావు, వీరస్వామి, బండి రాము, ఎం.వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు, శ్రీనివాసరావు, చలమాల విఠల్‌రావు వంగా ఉదయ్‌కుమార్, జె.పుల్లయ్య, కాటినేని శ్రీను సంతాపం తెలిపారు.

వక్ఫ్ బోర్డు బిల్లు రద్దు చేయాలి: సీపీఐ

వైరా, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ బోర్డు బిల్లు రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ శనివారం వైరాలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ముస్లింలతో కలిసి జాతీయ ప్రధాన రహదారిపై వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఆ బిల్లును రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎర్రా బాబు, మండల, పట్టణ కార్యదర్శులు యామాల గోపాలరావు, మిట్టపల్లి రాఘవరావు, నాయకులు మోట కొండా, రామకృష్ణ, బండారుపల్లి ముత్తయ్య, రాంబాబు, షేక్.షరీఫ్, సోందు, ఉద్దండు, కౌసర్, షరీఫ్, అఫ్జల్ పాల్గొన్నారు.

బోనకల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లును బీజేపీ ప్రభుత్వం ఉభయ పార్లమెంటు సమావేశాల్లో అమోదించడం పట్ల శనివారం మండలంలోని మధిర క్రాస్ రోడ్డు సమీపంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాతంగి శ్రీనివాసరావు, చావా రామకృష్ణ, షేక్ నిజాం, అబ్బాసీయా తదితరులున్నారు.

'మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి'

కొణిజర్ల, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): రైతులు పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని సింగరాయపాలెంలో జరిగిన రైతుసంఘం ఆవిర్భావదినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్పాదక ఖర్చు పెరిగి గిట్టుబాటు ధరలేక రైతులు వ్యవసాయం వదిలి ప్రత్యామ్నాయం చూసుకునే పరిస్థితి నేడు దేశంలో వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు దొడ్డపునేని కృష్ణార్జునరావు, వడ్లమూడి నాగేశ్వరరావు, బేగ్‌రోషన్, వడ్లమూడి మధు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అంకమ్మ తల్లి

సత్తుపల్లి, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రెండొందల ఏళ్ల చరిత్ర కలిగిన మండల పరిధిలోని బేతుపల్లిలోని అంకమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి మంత్రి తుమ్మల పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు పండి ప్రజలు అభివృద్ధి చెందాలని, ఆయురారోగ్యాలు ఆ అంకమ్మతల్లి ప్రసాదించాలని కోరుకున్నారు. అనంతరం పెద్ద తిరునాళ్లను ఆయన ప్రారంభించిన మంత్రి తుమ్మలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంతో తనకు ఉన్న అనుబంధాన్ని చిన్ననాటి మిత్రులతో పంచుకున్నారు.

ప్రారంభమైన పెద్దతిరునాళ్లు

ప్రతిఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ఉత్సవాల సందర్భంగా పెద్ద తిరునాళ్ల ప్రారంభమైనాయి. తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం అనంతరం బద్దెగొర్రె, చంద్రపట్నం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం తిరునాళ్ల రాత్రివరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



అంకమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గురువమ్మతల్లి జాతర



కారేపల్లి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండ ల పరిధిలోని పేరుపల్లి గ్రామంలో గల గురువమ్మతల్లి జాతర శనివారం ఘనంగా ప్రారంభం అయింది. ఈనెల 17వరకు జరగనున్న జాతరకు జిల్లా నలుములునుంచి భక్తులు వేలాదితరలిరానున్నారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ కంచర్ల శ్రీనువాస్‌రెడ్డి ఆలయంలో తొలిపూజకార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిత్యపూజలు, మహిళల చేత అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించారు.

ఆస్పత్రిలోనే భోజనం వండాలి: ఎమ్మెల్యే



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఇక్కడే భోజనం వండి వడ్డించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదేశించారు. శనివారం ఆస్పత్రిలో అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణతో పాటు ఇన్‌వార్డులో రోగులను పరీక్షించి సమస్యలను తెలుసుకున్నారు. వైద్యుల గదులు, మందుల స్టాక్, రోగుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఆస్పత్రికి రాత్రి సమయంలో యాక్సిడెంట్, ఇతర ఎమర్జన్సీ కేసులు వస్తే రిఫర్ చేయొద్దని, రోగులతో మర్యాదగా మాట్లాడాలని, దురుసుగా మాట్లాడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, పునరావృతం కావద్దన్నారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉందని, ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. వైద్యులు కూడా సమయపాలన పాటించలేదని, మధ్యాహ్నం 2గంటల వరకు ఆసుపత్రిలో ఉండాలని ఆదేశించారు. నూతన భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని, తద్వారా రోగులను మరిన్ని సేవలతో పాటు అత్యాధునిక సౌకర్యాలు ఈ ప్రాంత ప్రజలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు, వైద్యులతో పాటు సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వేంసూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. శనివారం వేంసూరు రైతువేదికలో 54మంది బాధితులకు ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ హాస్పిటళ్లలో వైద్యం చేయించుకున్న వారికి సగం నగదు మాత్రమే వస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనైతే వైద్యానికి రూ.పదిలక్షలలోపు వర్తిస్తుందని రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చటం జరుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

హనుమాన్ జయంతి

కారేపల్లి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా బస్టాండ్ సెంటర్ నుంచి మోటర్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శ్రీవెంకటేశ్వరస్వామి సంత ప్రాంగణంలోని శ్రీహనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్ర నర్సింహరావు, గుడెల్లి శ్రీనువాస్, తురక నారాయణ, సూర్యదేవర వెంకటేశ్వర్లు, రాముధరక్, సురేష్‌బూబ్, చిరునోముల రామారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

ఎన్నికల హామీలను అమలు చేయని ప్రభుత్వం

» మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సత్తుపల్లిలో మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చాక వాయిదాలు వేస్తూ ప్రజలను మోసగిస్తున్న వాయిదాల ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. శనివారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సన్నవడ్లకు బోనస్ ఇంకా జమ చేయలేదని, ఇటీవల ఆర్భాటంగా ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేని, ప్రారంభానికి ముందే రైతాంగం దళారులకు అమ్ముకుందని, ఈ ప్రభుత్వం వెంటనే మిల్లులను ఎలాట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 100పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదని, సింగరేణి డీఎంఎఫ్‌టీ నిధులు రూ.350కోట్లను ఈ ప్రాంత అభివృద్ధిపై వెచ్చించలేకపోయిందని, పక్కదారి పడుతున్నాయని, కానీ గత ప్రభుత్వంలో ఈ ప్రాంతానికి కేటాయించగలిగామన్నారు. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకముందు వనజీవి రామయ్య మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్‌కే.రఫీ, యాగంటి శ్రీను, దొడ్డా శంకరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, మల్లూరు అంకంరాజు, కాల్నేని వెంకటేశ్వరరావు, మోదుగు పుల్లారావు, ఆయుబ్‌పాషా, చాంద్‌పాషా, వనమా వాసు, మందపాటి వాసురెడ్డి తదితరులున్నారు.

వేంసూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జరుగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. శనివారం మర్లపాడులో జరిగిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, గొర్ల రామ్మోహన్‌రెడ్డి, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, పగుట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

» జేఎన్‌టీయూహెచ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వీ. రమణ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

సత్తుపల్లి, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): నేటి యువత కాలానుగుణంగా వచ్చే మార్పులను అన్వయించుకుని సాంకేతికతను మెరుగుపరచుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని జేఎన్‌టీయూహెచ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి. రమణ అన్నారు. మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 24వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన హాజరై ప్రసంగించారు. కళాశాల స్థాపించి నేటికి 24ఏళ్లు పూర్తయిన కాలవ్యవధిలో ఎందరో విద్యార్థులను ఈ ప్రపంచానికి అందించిందని, వారితో పాటు కళాశాల అధ్యాపకులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యాంతం అలరించాయి. కార్యక్రమంలో 15వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ.రంగారెడ్డి, సబ్ జైల్ సూపరింటెండెంట్ యు.కుటుంబరాజు, కళాశాల యాజమాన్యం చలసాని సాంబశివరావు, చలసాని హరికృష్ణ, కంచర్ల సత్యనారాయణ, కొత్తూరు ప్రభాకరరావు, కందిమళ్ల కృష్ణారావు, కొత్తూరు సత్యనారాయణ, చల్లా శ్రీనివాసరెడ్డి, ఎల్‌వీఆర్.దీక్షితులు, ఎం.అజయ్, ఏవీ.శ్రీనివాసరావు, ఎస్‌కే.జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు కొలిపాక మృతి

కొణిజర్ల, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం కొణిజర్లకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, ప్రైవేటు ఎలక్ట్రీషన్ బాద్యులు కొలిపాక వెంకటేశ్వర్లు(56) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, తాతా వెంకయ్య, సీఐటీయూ నాయకులు తాళ్ళపల్లి విజయ, మోత్కూరు వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు బోడపోతుల బాబు తదితరులు ఉన్నారు.

టీడీపీ గుర్తింపుకార్డుల పంపిణీ



గుర్తింపుకార్డులు అందజేస్తున్న చలపతిరావు

వైరా, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆపార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు పంపిణీ చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గత ఏడాది నవంబరు, డిసెంబరులో సభ్యత్వాలను నమోదు చేశారు. ఆసభ్యత్వ నమోదు గుర్తింపు కార్డులను సభ్యులకు చలపతిరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్, నూకవరపు అయ్యప్పచౌదరి, మందడపు మధుసూదన్‌రావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, కోటదాసు, పర్సా రామకృష్ణ, వెంకటేశ్వరరావు, కాంతారావు, రామారావు, మురళీ, కట్టా నర్సింహారావు, వెంకటకృష్ణ, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను స్నేహపూర్వకంగా నిర్వహించాలి

కొణిజర్ల, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): పల్లెటూరు వాతావరణంలో కబడ్డీని మరిచిపోకుండ నిర్వహించడం అభినందనీయం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు ఇన్‌చార్జీ నంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. కొణిజర్ల మండలం తనికెళ్ళలో గ్రామకమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలస్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కోసూరి శ్రీనివాసరావు, రాయల పుల్లయ్య, పొట్లపల్లి శేషగిరిరావు, గ్రామ నాయకులు చింతనిప్పు నరసింహరావు, గుండ్ల కోటి, ఉపాధ్యాయులు యాసా సత్యనారాయణ, లేడిబోయిన గోపాల్‌రావు, షేక్ రంజాన్, పత్తి లాలయ్య, రాజు, బండి లక్ష్మీనారాయణ, జిల్లా కబడ్డి అసోసియేషన్ కార్యదర్శి క్రిష్టఫర్ పాల్గొన్నారు.

మేడేపల్లి గ్రామం పరిశీలన

ముదిగొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మేడేపల్లి గ్రామం ఆదర్శంగా ఉందని కేంద్ర బృందం సభ్యులు ఎస్‌హెచ్.పంకజ్‌కుమార్, చంద్రాణి షాహా అన్నారు. శనివారం ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామాన్ని కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. క్లైమెట్ యాక్షన్ స్పెషల్ పంచాయతీ అవార్డు ఎంపికలో భాగంగా గ్రామాన్ని వారు సందర్శించారు. గ్రామం సందర్శనకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులకు గ్రామస్థులు బతుకమ్మ, కోలాటంతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో పర్యటించి పంటలు, పండ్ల తోటలను, సేంద్రీయ ఎరువు షెడ్లు, వన నర్సరీలను, ఇళ్లను, వీధులను, పంటపొలాలు, ఇళ్లలో ఏర్పాటుచేసిన సోలార్ సిస్టమ్, గోబర్ గ్యాస్ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన ఎస్‌పీఎం రాజయ్య, డీపీవో ఆశాలత, ఎంపీడీవోలు శ్రీధర్‌స్వామి, రవీంద్రప్రసాద్, శాస్త్రీ, ఉపేంద్రయ్య, డీఎల్‌పీవో నారాయణ, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సామినేని రమేష్ పాల్గొన్నారు.

వైరాలో గ్రూప్-1ర్యాంకర్లకు సన్మానం



శిరీషను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

వైరా, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివి గ్రూప్-1 ర్యాంకు సాధించటం నేటితరం యువతకు ఆదర్శమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యనమద్ది వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వైరా జడ్పీబాలికోన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ గ్రూప్-1 ర్యాంకు సాధించిన శిరీషను శనివారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు నాగబత్తిని స్వప్న, ప్రేమ్‌లీల, ప్రధానోపాధ్యాయురాలు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైరాలోని తొమ్మిదోవార్డుకు చెందిన గ్రూప్-1 ర్యాంకర్ సంగెపు లక్ష్మీసాహితిని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు, జిల్లా, మండల నాయకులు పి.సత్యనారాయణ, టీవీకే.సూరి, మరికంటి వాసుదాసు, ఎన్.పెంటయ్య, సామినేని వెంకటేశ్వరరావు, చల్లా కృష్ణారావు, ప్రసాద్, జీవీ.కృష్ణారావు పాల్గొన్నారు. అలాగే సీపీఐ ఆ ధ్వర్యంలో లక్ష్మీసాహితిని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ సన్మానించారు. భవిష్యత్‌లో సివిల్స్ సాధించాలని ఆకాంక్షించారు. నాయకులు దొబ్బల కృష్ణయ్య, యామాల గోపాలరావు, కొండా రామకృష్ణ, సోమయ్య, సంగెపు కృష్ణ, రామకోటయ్య పాల్గొన్నారు. ఇదిలా ఉంటే లక్ష్మీసాహితిని వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, డాక్టర్ కె.మోహన్‌రావు, మిట్టపల్లి రమేష్, గుమ్మడదల వెంకటనారాయణ, దరిపల్లి శ్రీనివాసులు అభినందించారు.



లక్ష్మీసాహితిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

వరి పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఎర్రుపాలెం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల అకాలవర్షాంతో దెబ్బతిన్న పంటలను బీజేపీ నాయకులు శనివారం పరిశీలించారు. బీజేపీ తలపెట్టిన గావ్‌ఛలో.బస్తీచలో కార్యక్రమంలో భాగంగా మధిర నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నూతక్కి నరసింహారావు, కత్తిరవి, లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, శ్రీహరి, రంగారావు పాల్గొన్నారు.

మినీ వాటర్ ప్లాంట్ల ప్రారంభం

కల్లూరు, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన నారాయణపురంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు మినీ వాటర్ ప్లాంట్స్‌ను మంత్రి సోదరుడైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. నారాయణపురం, కొత్తనారాయణపురం గ్రామాల్లో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు తరుపున ప్లాంట్స్ ఏర్పాటుకు స్థలంతో పాటుగా రూ.25 లక్షలు వితరణ చేశారు. అనతి కాలంలోనే కల్లూరు ప్రజలకు ఇచ్చిన మాటా ప్రకారం కల్లూరును మునిసిపాలిటీగా కూడా చేశారన్నారు. ఈ సందర్భంగా తమ గ్రామాల్లో ఉచితంగా మంచినీరు అందించే క్రమంలో రెండు వాటర్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేసినందుకు మంత్రి పొంగులేటి సోదరులు శ్రీనివాసరెడ్డి, ప్రసాదరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పొంగులేటి చిన్న సుధాకర్‌రెడ్డి, భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పన్నీరు కోటారెడ్డి, పి. అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

ఆకట్టుకున్న డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు



బహుమతులను అందిస్తున్న నిర్వాహకులు

కల్లూరు, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కప్పలబంధం గ్రామంలో మూడు రోజుల పాటుగా జరుగుతున్న అంకమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన జిల్లా స్థాయి డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. విజేతలకు సీనర్జీ క్రాప్ ప్రొటెక్షన్ అధినేత కర్నాటి వెంకటరెడ్డి, జిల్లెళ్ల కృష్ణరెడ్డి, ఆశోక్‌రెడ్డి సదాశివరెడ్డి, కర్నాటి రత్నాలరెడ్డిలు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లెళ్ల భాస్కరరెడ్డి, శీల నాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ముక్కర నరేందర్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

తల్లాడ మండలంతో వనజీవికి అనుబంధం



మల్లవరంలో మొక్క నాటుతున్న వనజీవి రామయ్య(ఫైల్)

తల్లాడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోటి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేసిన పద్మశ్రీ వనజీవి రామయ్యకు తల్లాడ మండలంతో అనుబంధం ఉంది. తల్లాడ మండలంలోని మల్లవరం, రామానుజవరం గ్రామాల్లో జరిగిన వన మహోత్సవ కార్యక్రమాల్లో వనజీవి రామయ్య పాల్గొన్నారు. రామానుజవరంలో జిల్లాలోని ప్రత్యేక గుర్తింపు పొందిన వనాలను ఆయన సందర్శించి ఇందుకు కృషిచేసిన తాజా మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ శీలం శివపార్వతిలను అభినందించారు. మల్లవరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో వనజీవి రామయ్య పాల్గొని పర్యావరణ ప్రాధాన్యతను స్థానికులకు వివరించటం జరిగింది. శనివారం వనజీవి రామయ్య మృతితో ఆయా గ్రామాల్లో ప్రజలు వనజీవి రామయ్యతో ఉన్న అనుబంధాన్ని నెమరవేసుకొని దిగ్భ్రాంతికి లోనయ్యారు.

శంకర్‌నాయక్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కారేపల్లి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాణికార్యం గ్రామానికి చెందిన గుగులోత్ శంకర్‌నాయక్‌పై అక్రమంగా పోలీసులు అదుపులోకి తీసుకుని విక్షణరహితంగా కొట్టి హింసించిన పోలీసు సిబ్బందిపై జిల్లా పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో జరిగిన సంఘటనపై పోలీసులు సింగరేణి మాజీ ఉద్యోగి అయిన శంకర్‌నాయక్‌ను విచారణ పేరుతో కామేపల్లి పోలీసుస్టేషన్‌కు తీసువెళ్లి శంకర్‌నాయక్‌ను తీవ్రంగా కొట్టారని అన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.